# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

APRIL - 2019

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

ఆదివారం సాయంత్రం : 6.00 గంటలకు శుభవార్త

బుధవారం సాయంత్రం : 6.30 గంటలకు రక్షణ

గురువారం మధ్యాహ్నం : 2.30 గంటలకు రక్షణ

ప్రతిరోజు ఉదయం : 7.30 ని॥ కాంతి ఛానల్‌లో

ప్రతిరోజు మధ్యాహ్నం : 3.30 ని॥ కాంతి ఛానల్‌లో

ప్రసంగీకులు : జాషువా గూటం

రిక్కీ గూటం

రోనీ గూటం

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


SATYA VANI

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 40 ఏప్రియల్ - 2019 సంచిక -9


## కృప ద్వారా రక్షణ

## ( Salvation by Grace )

దేవుని కృపకంటె మరొక దాని యందు మానవుడు ఎక్కువ లక్ష్యముంచ రాదు. కృప అనగా కరుణ, దయ, కటాక్షము మొదలగునవి. మన జీవితమంతయు దేవుడు మన యెడల చూపించు కృపను బట్టియే జీవించు చున్నాము. ఈ భౌతిక లోకములో ఆయన గాలిని, నీటిని, ఆహారమును, సూర్యరశ్మిని, నిజానికి సమస్తమును మనకు ఆయన కృపచేతనే దయచేయు చున్నారు. అయితే ఆత్మీయ జీవితములో దేవుడు మనకనుగ్రహించు కృపను గూర్చి ఈ రోజు మనము తెలిసికొను బోవుచున్నాము. మానవుడు కృపవలన రక్షించబడును. లేఖనములు ఈ సంగతిని విపులముగా బోధించు చున్నవి.

"మీ అపరాధముల చేతను, పాపముల చేతను మీరు చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను... అయినను దేవుడు కరుణా సంపన్నుడై యుండి మనము మన అపరాధముల చేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమచేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను. కృపచేత మీరు

రక్షింపబడి యున్నారు... మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడవీలులేదు." అని అపో.పౌలు ఎఫెసులో యున్న క్రైస్తవులను హెచ్చరించెను (ఎఫెసీ 2:1 -9). ఇవియేగాక అనేక లేఖనములు కూడ ఇదే సంగతిని బోధించుచున్నవి. దేవుని కృపలేనియెడల నీవు నేను కూడ నశింతుము.

బైబిలును నమ్మువాడెవడును మనము దేవుని కృపద్వారా రక్షింపబడి యున్నామను సంగతిని కాదనడు. అయితే రక్షింపబడుటకు మనము ఆశించుచున్న యెడల కృపతో మరికొంత మనము గమనించవలసి యుండును. దేవుని కృపప్రత్యక్షమైన వారందరు రక్షింపబడగల్గిన యెడల ఈ లోకములో ఎవడును నశించడు. ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్ష మాయెను (తీతు 2:11). సమస్త మనుష్యులను రక్షించగల దేవుని కృప వెల్లడి అయినను అనేకులు నశింతురు. "మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే".

కృప-విశ్వాసము : "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షించబడును; నమ్మనొల్లని వానికి శిక్ష విధించబడును (మార్కు 16:16). మనుష్యుడు రక్షించబడుటకు విశ్వాసము అవుసరము. మానవుడు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షించబడును.

రక్షణ సంకల్పము రెండు విధములైనది. 1) దేవుని కృప 2) మానవుని విశ్వాసము. మనకొరకు దేవుడు చేసినదంతయు ఆయన కృపయగును. రక్షించబడుటకు మానవుడు చేయవలసినదంతయు విశ్వాసము వలన చేయవలెను. ఒకడు రక్షించబడవలెనంటే కృప, విశ్వాసము – ఈ రెండు అత్యవుసరము. ఉదాహరణ కొరకు : నీరు దాహమును తీర్చును గాని దానిని మనము త్రాగవలెను. ఆహారము ఆకలిని తీర్చును గాని దానిని మనము భుజించవలెను. మా

అనుదినాహారము మాకు దయ చేయుము అని మనము ప్రార్థించ వచ్చును గాని దానిని సంపాదించుటకు ప్రయత్నమేమియు చేయనియెడల ఆకలితో మాడవలసి వచ్చును. ఆహారము దేవుడిచ్చు యీవియై యున్నది. గాని దానికొరకు మనము కృషి చేయవలెను.

**అందరికీ దేవుని కృప :** దేవుని కృప అందరి నిమిత్తము ఉన్నది. మానవుని రక్షించు నిమిత్తము దేవుడు చేయగలిగినదంతయు సంపూర్తిగా చేసెను. మానవుడు నశించుచున్నా డంటే ఆ దోషము అతనిదే గాని దేవునిది కాదు. మనలను రక్షించు దేవుని కృపను విశ్వాసము ద్వారా పొందగలము, పొందవలెను. అయితే ఎటువంటి విశ్వాసము? మృత మైన విశ్వాసము మాత్రము కాదు. ఏలయనగా విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగానుండి మృతమైన దగను. ప్రాణములేని శరీరమేలాగు మృతమో అలాగే క్రియలు లేని విశ్వాసము మృతము (యాకోబు 2: 17, 26). యేసు కాలములో యూదుల అధికారులుకూడ అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి గాని సమాజములో నుండి వెలివేయబడుదు మేమోయని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు. వారు దేవుని మెప్పుకంటె మనుష్యుల మెప్పును ఎక్కువగా అపేక్షించిరియని యోహాను 12:42, 43లో వ్రాయబడి యున్నది. ఈ అధికారులకున్న విశ్వాసము యెట్టిది? మృతమైనది!! అని మనము ఇట్టే చెప్పగలము గదా! అయితే మానవుని రక్షించునట్టి విశ్వాసము ఎట్టిది? గలతీ 5:6లో పౌలు, ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజనకరమగును అని చెప్పు చున్నాడు. జీవముగలదియై కార్యము లను సాధించు విశ్వాసము మనలను రక్షించు దేవుని కృపలోనికి నడిపించును. మనుష్యుడు విశ్వాసము నుపయోగించవలెను, రక్షించునట్టి విశ్వాసము విధేయత చూపించు విశ్వాసము.

**విశ్వాసము అవసరము :** మనుష్యులు విశ్వాసము ద్వారా కృపచేత యెట్లు రక్షించబడిరోయని

మనము ఊహించుకోనవుసరము లేదు. ఎఫెసులోని క్రైస్తవులే దానికి సజీవము గల సాదృశ్యమై యున్నారు. వారికే పౌలు ఎఫెసీ 2:8,9ని వ్రాసెను. కృప ద్వారా రక్షించబడుటకు ఎఫెసీయులు ఏమి చేసిరో మనము తెలిసికొనగలిగిన యెడల ఈనాడు కూడా మనమును అట్లే చేసి రక్షించబడగలముగదా. ఎఫెసులో యున్న వారేమిచేసిరి?.

**రక్షణ మార్గము :** ఎఫెసీయులు సత్యవాక్యమును వినిరి (ఎఫెసీ 1:13). గనుక ఒకడు విశ్వాసము ద్వారా కృపచేత రక్షింపబడ వలెనంటే అతడు సత్యమును విన వలెను. ఏలయనగా వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17). ఎఫెసీయులు సత్యవాక్యము ను విని క్రీస్తునందు విశ్వాసముంచిరి (ఎఫెసీ 1:13). ఎఫెసీయులు మారు మనస్సు పొందిరి. అపొ.పౌలు వారికి బహిరంగముగాను, ఇంటింటను బోధించుచు దేవుని యెదుట మారు మనస్సు పొంది మన ప్రభువైన యేసు క్రీస్తు నందు విశ్వాసముంచవలెనని వారికి సాక్ష్యమిచ్చినట్లు అపొ.కా 20: 21లో వ్రాయబడి యున్నది. ఎఫెసీయులు ఒప్పుకొనిరి (అపొ.కా. 19:18). ఆ విశ్వాసము ద్వారా కృప చేత రక్షింపబడవలెనంటే క్రీస్తునందలి విశ్వాసమును ఒప్పుకొనవలెను. "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:10). ఎఫెసీయులు బాప్తిస్మము పొందిరి. ఎఫెసులో మొదటిగా మార్పు జెందిన వారికి క్రీస్తును గూర్చియు ఆయన ఆజ్ఞాపించిన బాప్తిస్మమును గూర్చియు బోధింపగా "వారు ఆ మాటలు విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 19:5). తరువాత ఎఫెసులోని క్రైస్తవులకు ఒక పత్రిక వ్రాయుచు "ప్రభువు ఒక్కడే విశ్వాసము ఒక్కటే, బాప్తిస్మము ఒక్కటే" యని అపొ.పౌలు ప్రకటించెను (ఎఫెసీ 4:5). గనుక ఎఫెసీయుల వలె విశ్వాసము ద్వారా మనము రక్షింపబడవలెనంటే క్రీస్తు నామమున పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము

పొందవలెను (అపో.కా. 2:38).

**విశ్వాసమునకు విధేయత :** ఎఫెసీయులు విశ్వాసము ద్వారా కృపచేత రక్షింపబడిరని దేవుని వాక్యము మనకు తెలియజేయుచున్నది. వారు ఏమిచేసిరోకూడా అది మనకు తెలియ జేయుచున్నది. వారు వాక్యమును వినిరి, విశ్వసించిరి, మారు మనస్సు పొందిరి, క్రీస్తునందున్న విశ్వాసమును వారు ఒప్పుకొనిరి, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. ఆ సంగతులనే మానవుడు నేడుకూడ జరిగించిన యెడల అతడు కూడ విశ్వాసము ద్వారా కృపచేత రక్షింపబడగలడు. ఏలయనగా దేవుడు పక్షపాతికాడు. ప్రతిజనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచు కొను వానిని ఆయన అంగీకరించును (అపో.కా.10:34). గనుక ఆయన ఎఫెసీయులకేమి చేసెనో, దానినే మనకును చేయగలడు.

సమస్త మనుష్యులకు రక్షణకర మైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి... ఈలోకములో స్వస్థ బుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించు చున్నది (తీతు 2:11-13). మనము మన స్వనీతిని బట్టి రక్షింపబడలేము. మన రక్షణను మనమే సంపాదించు కొనలేము. దేవుడు ఆజ్ఞాపించిన దానిని చేయుటలో మన స్వనీతిపై ఆధార పడుచున్నామని కాదు. ఆయన ఆజ్ఞాపించినవన్నియు చేసిన తరువాత కూడ మనము నిష్ప్రయోజకులైన దాసులము మాత్రమే (లూకా 17:10). అయినను దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచు చుండవలెను, మానవ కోటికి ఇదియే విధి (ప్రసంగి 12:13).

నీవు దేవుని కృపకు లోబడితివా? ఆయన కృపను బట్టి రక్షింపబబ గోరు చున్నయెడల క్రీస్తునందు విశ్వసించుము, పాపముల విషయమై మారు మనస్సు బొందుము, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది రక్షింపబడుము. ఆయన కృపలో జీవించి ఆనందించుము.

# క్రీస్తు నామము

## ( The Name of Christ )

క్రొత్త నిబంధన చదువునప్పుడు క్రీస్తునామము అనేక మారులు చెప్ప బడి యుండుటలో మనము ఆశ్చర్య పడవచ్చును. పేరు ప్రాముఖ్యము కాదని, పేరులో ఏమియు లేదని కొందరు వాదించుదురు. ఇది కొన్ని నామముల యెడల సత్యమే కావచ్చును గాని, ప్రభువు నామము అట్టిది కాదు ఈక్రింది సంగతులను గమనింపుము:

**1.** దేవుని ప్రజలు ఒక క్రొత్త నామమును బట్టి పిలువబడుదురు (యెష 62:2). మనము క్రొత్త నిబంధనలో చూచిన యెడల సంఘము క్రీస్తునామమును ధరించ వలెననియు (రోమా 16:16, 1కొరింధీ 12:13). వ్యక్తిగత సభ్యులు క్రైస్తవులని పిలువబడవలెననియు (అపో.కా. 11:26) మనకు తెలియు చున్నది.

**2.** కుటుంబ నామము క్రీస్తు నామము. ఎఫెసీ 3:14,15లో పౌలు ఇట్లు పలికెను:" ఈ హేతువు చేత పరలోకము నందును, భూమి మీదను ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రిని బట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రి యెదుట నేను మోకాళ్ళూని ప్రార్థించుచున్నాను".

**3.** సంఘము క్రీస్తు యొక్క పెండ్లి కుమార్తెయని చెప్పబడినది. పెండ్లి కుమార్తె ఆయన పేరును ధరించును (ప్రకటన 21:19), 22:17). క్రీస్తుకు ఒకే ఒక్క పెండ్లి కుమార్తె యున్నది. ఆయన తిరిగి వచ్చినపుడు ఆయన నామమును ధరించిన దాని కొరకు వచ్చును (ఎఫెసీ 5:27).

**4.** ఆయన నామము ప్రతి నామమునకు పై నామము. "అందు చేతను పరలోకమందున్న వారిలోగాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలోగాని, ప్రతివాని మోకాలు యేసు నామమున వంగు

నట్లును ప్రతినాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను (ఫిలిప్పీ 2: 9-11).

**6.** క్రీస్తు నామమందు మనము విశ్వాసముంచవలెను. "దేవుని కుమారుని నామమందు విశ్వాస ముంచు మీరు నిత్యజీవము గలవారని తెలుసుకొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను" (1 యోహా 5:13).

**7.** క్రీస్తు నామమును ఒప్పుకొనవలెను "ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడు దుర్నీతి నుండి తొలగిపోవలెను" (2తిమో 2:19).

**8.** మారుమనస్సు పొంది క్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

**9.** ప్రభువు నామమున ఆరాధనకు కూడు కొనవలెను. "ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని" క్రీస్తు చెప్పెను (మత్తయి 18:20).

**10.** సమస్తమును ఆయన నామమున చేయవలెను. "మరియు మాటచేత గాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రి యైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17).

**11.** నీతిమంతులు ఆయన నామమును బట్టి హింసింపబడుదురు. "మీరు నా నామము నిమిత్తము అందరి చేత ద్వేషింపబడుదురు. అంతము వరకును సహించినవాడు రక్షింప బడును" (మత్తయి 10:22).

**12.** క్రీస్తు నామమున ప్రార్థన **చేయవలెను.** "మీరు నా నామమును దేని నడుగుదురో తండ్రి కుమారుని యందు మహిమ పరచుటకై దానిని చేయుదును" (యోహా 14:13).

**13.** క్రీస్తు నామమును **దూషించకూడదు,** "మీకు పెట్టబడిన శ్రేష్టమైన నామమును దూషించువారు వీరేగదా?" (యాకోబు 2:7).

**14.** **పాపక్షమాపణ** క్రీస్తు **నామమున దొరకును.** "చిన్నపిల్లలారా, ఆయన నామమున బట్టి మీ పాపములు క్షమించబడినవి గనుక మీకు వ్రాయుచున్నాను" (1యోహా 2:1).

**15.** ఆయన నామమున కృషి **చేయవలెను.** "నీవు సహనము కలిగి నా నామము నిమిత్తము భారము భరించి అలయలేదనియు నేనెరుగదును" (ప్రకటన :3).

**16.** క్రీస్తు నామము ద్వారా **నిత్య జీవము కలుగును.** "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్ము నట్లును నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును యివి వ్రాయబడెను" (యోహా 20:31).

ఇప్పుడు క్రీస్తు నామము ఎంత ప్రాముఖ్యమైనదో నీవు తప్పక గ్రహించి యుందువు. అది నిజమయిన యెడల నీవు, నేను వ్యక్తిగతము గాను, సంఘము గాను, క్రీస్తునామమును ధరించుట అత్యవసరమని నీవు గ్రహింపగలవు. నేను క్రీస్తు సంఘ సభ్యుడను గనుక క్రైస్తవుడను మాత్రమే. నీ సంగతి ఏమి? నీవు బైబిలు నందు చదువగల సంఘసభ్యుడవా? నీవు క్రైస్తవుడవా లేని యెడల ఈనాడే అట్లగుము.

-జె.సి. ఛోట్

సత్యవాక్కును మీ
బంధువులకు, మిత్రులకు
పరిచయం చేయండి

# పేరులో ఏమున్నది?

## ( What is in a Name ? )

బ్యాంకులో చెక్కులు మార్చునపుడు పత్రములు వ్రాయునప్పుడు ఆస్తుల విషయములోను, పేరుకు చాల ప్రాముఖ్యతవున్నది గదా? ఆత్మీయ విషయములలో గూడా పేరునకు చాలా ప్రాముఖ్యత యున్నది. దేవుని బిడ్డలందరును, క్రీస్తుపేరట నామకరణ చేయబడ్డారు. (ఎఫెసీ 3:14-16) ఇది నిజవేకదా! అయిన యెడల మతశాఖల పేర్లను ధరించి, ఈ నామమునకు భేదములు పుట్టించుటేల? ఇది కేవలము మనుష్యుల కల్పన మాత్రవే. "క్రైస్తవుడు" అనునది మిక్కిలి శ్రేష్టమైన పేరుగా యాకోబు 2:7లో చెప్పుచున్నాడు. "క్రైస్తవుడు" అను పేరునకు ముందుగాని వెనుక గాని ఇతర పేర్లను చేర్పించుట చేయకూడనిపని. ఈనామములోనే మనకు రక్షణ (అపో.కా.412). ఈ నామములోని మనము బాప్తీస్మము పొందితివిమి (అపో.కా. 2:38). మొదటి శతాబ్ధములో శిష్యులు "క్రైస్తవుల"ని మాత్రమే పిలువబడిరి (అపో.కా. 11:26). క్రైస్తవుడుగా మాత్రమే మనము బాధ అనుభవించుటకు అర్హులము (1 పేతురు 4:16). ఆయన నామము ధరించుటవలన క్రైస్తవులు తృణీకరింపబడుదురు (మత్తయి 10:22). మొదటి శతాబ్ధములో ఆయనను గౌరవించుటకై ఆయన నామమును శిష్యులు ధరించిన ఎడల, ఇప్పుడును అదే విధముగా మనము ఎందుకు గౌరవించలేము? మనుష్యుల పేర్లను ఎందుకు ధరించవలెను? మతసంస్థల పేర్లను ఎందుకు ధరించవలెను? ఇవన్నియు మనుష్యుల ఆలోచనలే, అట్టి పేర్లను క్రైస్తవులు ధరించుట ఆత్మీయముగా చాల అపాయకరమైన సంగతి "మీరెక్కడివారో మిమ్మును ఎరుగను (లూకా 13:27)" అని యేసుక్రీస్తు వారిచేత అనిపించుకొందుమా?

బి. ఆనందరావు
గుడిపూడి -6301403850

# క్రీస్తును ఎవరు సిలువ వేసారు?

## ( Who Crucified Christ ? )

క్రీస్తును ఎవరు సిలువ వేసారనే దాని పై వాగ్వాదము శతాబ్దముల తరబడి జరుగుచునేయున్నది. ఆపని ఎవరు చేసారు? ఎవరిని నిందించాలి? నిజానికి ఈ విషయంలో ఏ ఒక్క వ్యక్తిని లేక గుంపును మనం నిందించ లేము.

అయితే మొదటిగా, సాతానుడు క్రీస్తును సిలువ వేసాడని తెలిసి కొందాము. ఏదెను వనంలో సాతానుడు ఆదాము హవ్వలను శోధించాడు. నిషేధింవబడిన ఫలమును వారు తిన్నారు. తద్వారా లోకాన్నంతటిని పాపములో ముంచారు. "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, అలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్త మాయెను" అని రోమా 5:12 చెప్పుచున్నది. పాపము వలన క్రీస్తు సిలువ అవుసరమాయెను. మానవుడు రక్షింప బడే విధానము అదొక్కటే, దేవుడు దీనిని ముందుగానే చూచెను. అందువలన జగదుత్పత్తి మొదలుకొని వధింపబడిన గొర్రెపిల్ల క్రీస్తు (ప్రక 13: 8). పాపము ఈ లోకములో ప్రవేశించిన తరువాత మొదటి ప్రవచనము చెప్పబడెను. ఆదికాండము 3:15 ఇట్లు చెప్పుచున్నది : "మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమెమీద కొట్టుదువని" దేవుడు సాతానుతో చెప్పెను. క్రీస్తు సిలువ మరణము అపవాదికి మరణాఘాతమాయెను. దాని నుండి అది తిరిగి లేవలేదు. క్రీస్తు సిలువ మరణము వలన అపవాదికి ఆయన మడిమె మీద కొట్టుటకు అవకాశము దొరికెను.

క్రీస్తును సిలువ నుండి మరలించడానికి అరణ్యములో ఆయనను అపవాది శోధించెను (మత్త 4:1-13). గాని అది నిష్ప్రయోజన మాయెను. ఆత్మను రక్షించే శక్తి సిలువలో యున్నదని అపవాది ఎరుగును. అందువలన మానవులను క్రీస్తు నుండి దూరము చేయాలని అది ప్రయత్నించును. వాడు మానవుని మిత్రుడుకాదు. ఎవని మ్రింగుదునా యను గర్జించు సింహము వలె అతడు యెదకుచు తిరుగుచున్నాడు (1 పేతురు 5:8). మనుష్యులు దేవుని వాక్యమును విని విశ్వసించి రక్షింపబడకుండా వారి హృదయములో నుండి వాక్యమును ఎత్తుకొనిపోవును (లూకా 8:12). దానిని చేయలేకపోతే సువార్త వెలుగు ప్రకాశింపకుండా వారి మనోనేత్రముల కతడు అవిశ్వాసము వలన గ్రుడ్డితనము కలుగజేయును (2 కొరింథీ 4:4). అతడు లోకము నంతటినీ మోసగించ ప్రయత్నించును (ప్రక 12:12). ప్రభువైన యేసును అప్పగించిన ఇస్కరియోతు యూదా హృదయములో అతడు ప్రవేశించెను (లూకా 22:3). సాతాను యొక్క ప్రయత్నముల వలన క్రీస్తు సిలువ వేయబడెను. దీన్ని గూర్చి సంశయం యేమీ లేదు. వాని ప్రయత్నము వలన క్రీస్తు సిలువ నెక్కెను.

రెండవదిగా, యూదులు క్రీస్తును సిలువకు మేకులతో కొట్టిరి. వారే స్వయంగా ఆ పనిచేయలేదు. గాని వారి కోరికమేరకు రోమీయులు యేసును సిలువ వేసిరి. పిలాతు తన చేతులు కడుగుకొని యేసు నిర్దోషియని ప్రకటించెను. "అందుకు ప్రజలందరు - వాని రక్తము మామీదను, మా పిల్లల మీదను ఉండుగాకనిరి" (మత్తయి 27:25). "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి" యని పేతురు యూదులకు తెలియజెప్పెను (అపొ.కా. 2:23). "మీరు జీవాధిపతిని చంపితిరి గాని దేవుడు ఆయనను

మృతులలో నుండి లేపెను" అని అపొ.కా. 3:15లో అతడు మరల తెలియజేసెను. రోమీయులు యేసును సిలువకు మేకులతో కొట్టిరి, గాని యూదుల కోరిక మేరకు వారట్లు చేసిరి.

మూడవదిగా మానవ జాతియే యేసును సిలువ వేయించెను. యెషయా 53:5,6 ఇట్లు చెప్పుచున్నది. "మన యతిక్రమములను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనందరము గొర్రెలవలె త్రోవతప్పిపోతిమి, మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మన యందరి దోషము అతనిమీద మోపెను". ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెఱుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2కొరింథి 5:12). "మనము పాపముల విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి" యని పేతురు చెప్పెను (1 పేతురు 2:24). యేసు లోక రక్షకుడు (యోహాను 4:42). "ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వ లోకమునకును శాంతికరమైయున్నాడు" (1యోహాను 2:2). నిజంయేమంటే, నీవు నేను యేసును సిలువపైకి ఎక్కించాము.

నాల్గవదిగా యేసు ప్రభువు తనకు తానే సిలువ వేయబడెను. జగదుత్పత్తి మొదలుకొని వధించబడిన గొర్రెపిల్ల ఆయనే. ఆయన చేయవలసిన దేమిటో ఆయన ఎరుగును. యోహాను 10:17,18లో ఆయన మాటలను వినుము : "నేను దానిని మరల తీసుకొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ఇందు

వలననే నా తండ్రి నన్ను ప్రేమించుచున్నాడు. ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దానిని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు నాకు అధికారము కలదు. దాని తిరిగి తీసుకొనుటకును నాకు అధికారము కలదు". యేసు బుద్ధిపూర్వకముగా, ఇష్టపూర్వకముగా సిలువపై బలియాయెను. తండ్రియైన దేవుడు ఆయనను అందు నిమిత్తము బలవంతము చేయలేదు. ఆయన స్వేచ్ఛాపూర్వకముగా దాన్ని జరిగించెను. అయితే యేసు ఇష్టపూర్వకముగా ఎందుకు సిలువనెక్కెను? ఆయన మనలను ప్రేమించినందు వలన!

చివరిగా తండ్రియైన దేవుడు యేసును సిలువ వేయించెను. "అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను, ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను... అతడు తనకు కలిగిన వేదన చూచి తృప్తినొందును అని యెషయా 53:10,11లో చెప్పబడినది. ఏలయనగా, "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయన ననుగ్రహించెను" (యోహాను 3:16). "అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే, క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8).

చివరి సమీక్షలో మనం యూదులను, రోమీయులను, అపవాదిని క్రీస్తును సిలువ వేయించినందుకు నిందించవచ్చును. గాని చివరికి మనలను మనమే నిందించుకోవాలి తప్ప ఇంకెవరినీ కాదు. నా మట్టుకు నేను నన్ను తప్ప ఎవరినీ నిందించను. నా పాపములే క్రీస్తు ప్రభువును ఆ ఘోరమైన సిలువకు మేకులతో కొట్టెను!

– జాన్ స్టేసీ

# క్రైస్తవ్యము పాశ్చాత్యుని మతము కాదు

## ( Christianity is not Western Religion )

క్రైస్తవ్యము పాశ్చాత్యుని మతమని ఎవరంటారో వారు వాస్తవములను సరిగా ఎరిగినవారు కారు..

క్రైస్తవ్యము పశ్చిమాన కాదు, తూర్పుననే ప్రారంభమాయెను. క్రీస్తు ఆసియాలోనే జన్మించి, జీవించి, మరణించి, తిరిగిలేచెను. ఆయన మృతులలో నుండి లేచెను. ఆయన దేవుని యొద్దకు ఆసియా నుండే ఆరోహణమాయెను. ఆయన పశ్చిమ ప్రాంతములో ఎన్నడును పర్యటించ లేదు. క్రీస్తు సంఘము ఆసియాలోనే ఆరంభమై, ప్రపంచమంతా వ్యాపించెను.

క్రైస్తవ్యము దృక్పధములో విశ్వ జనికమైనది. అది తూర్పున ప్రారంభమై అన్ని కాలములలో సర్వ దేశములందలి సర్వమానవుల నిమిత్తమైన దేవుని స్వంత మతము. క్రీస్తు బోధ ఒక దేశమునకే పరిమితము కాదు. దాని రక్షణ సందేశము, నిత్య జీవము అందరకు అవసరము. దాని గొప్ప జీవిత సూత్రములు సర్వదేశము లందలి ఎల్లరకు ఎటువంటి రాజకీయ పాలన క్రింద ఉన్న వారికైనను అనుగుణ్యమైనవే. నిజక్రైస్తవ్యము, క్రీస్తుచే బోధింపబడినందున, తూర్పున గాని, పశ్చిమాన గాని ఉన్న దేశములను, మానవులను ఉద్ధరించును. బైబిలును చదువుము. నిజ క్రైస్తవ్యమును తెలిసికొనుము.

### దేవుని యొక్క ఉనికి

భూమి ఉన్నది. మనము జీవించు చున్నాము. విశ్వము ఉన్నది. అయితే అదెక్కడ నుండి ఉద్భవించినది? "శూన్యము నుండి ఏమియు ఉద్భవింపజాలదు". గనుక తార్కికరీత్యా స్వయం సంభూతమైనది, శాశ్వతమైనది ఏదో ఉండి యుండాలి.

పదార్ధము కంటె ఆత్మ మిన్న యని అందరు అంగీకరింతురు. కాబట్టి నిర్జీవమైన తెలివిలేని పదార్ధము జీవమును, తెలివిని క్రమమును

ఉద్భవింపజేసెనని నమ్ముట కంటె, జీవమును జ్ఞానమునై యున్న దేవుడు విశ్వమునందలి ఆశ్చర్యకరమైన సమస్త సౌందర్యమును, శక్తిని, రూపమును కలుగజేసెనని నమ్ముటయే మిక్కిలి భావ్యము.

### ప్రేలుడు క్రమమును రూపమును ఉత్పత్తి చేయునా?

అతీతమైన కాలములో ఒక బ్రహ్మాండమైన ప్రేలుడు అంతరిక్ష మందు సంభవించుట వలన నేడు మనము చూచుచున్న ఈ విశ్వము ఉద్భవించెనని కొందరు చెప్పుదురు. అది యుక్తమా? ప్రేలుడు వలననైన పెక్కు-పర్యవసానములను నేను చూచాను. ఆ ఫలితములెన్నడు సౌందర్యము, క్రమము, రూపము కల్గి లేవు! "మిక్కిలి పెద్దదైన ఒక గడియారములో ప్రేలుడు తటస్థించెను. తత్ఫలితముగా ఈ అందమైన, నికరమైన 1000 గడియారములు ఉత్పత్తి ఆయెను" అని దుకాణములో గడియారములు అమ్ముచున్న వాడు చెప్పాడు అనుకొందాం. నీవు దానిని నమ్ముదువా? విశ్వము యొక్క వింతలతో సరిపోల్చుటకు ఆ వేయి చక్కని గడియారముల ఉదంతము తగినది కాదు. కీర్తనలు 19:1-3 యిట్లు చెప్పుచున్నది. "ఆకాశములు దేవుని మహిమను వివరించు చున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచుర పరచుచున్నది..." ఔను, నింగిలో ప్రకాశించుచున్న నక్షత్రములను, గ్రహములను గాంచినప్పుడు మనము వాటిని చేసి నిర్వహించుచున్న దేవుని పూజింపవలెను.

### దేవుడు భూమిని నివాసస్థలముగా చేసెను (యెషయా 45:18)

1. చంద్రుడు రాత్రియందు వెలిగిచ్చుటకు చేయబడెను. నివాస స్థలముగా చేయబడలేదు. (ఆది 1:16-18). వ్యోమగాములు యిది సత్యమని గ్రహించిరి.

2. సూర్యునికి భూమి 93 మిలియను మైళ్ళు దూరమున ఉంచబడెను. నరుడు ఘనీభవించి పోకుండను, దహింపబడకుండను ఉండుటకు అది సరియైన దూరము.

3. భూగోళము యొక్క బరువు 6,570

క్వింటిలియను టన్నులు. భూమి దానిచుట్టు అది, దాని అక్షము పై ఖచ్చితముగా 24 గంటలలో చలించును. అది దాని అక్షము పై చుట్టు తిరుగుటకు నెలరోజులు పట్టినట్లయితే, మనము ఒక పగటిలో భస్మమై రాత్రియందు గడ్డకట్టుకు పోవుదుము. దానిని రూపించినవాడు సరిగానే చేసెను.

4. సముద్రము యొక్క పాటు పోటులకు హేతువైన చంద్రగ్రహము భూగోళమునకు 2,40,000 మైళ్ళ దూరములో ఉన్నది. ఆ దూరము 24,000 మైళ్ళే ఉంటే భూమి అంతయు దినమునకు రెండు పర్యాయములు జలమయమగును. దానిని సంకల్పించిన వారు సరిగానే రూపించిరి.

5. ఉపరితల వాతావరణ మందున్న "వాన్ ఎలెన్ రేడియేషన్ బెల్ట్" హానికరమైన సూర్యకిరణములను వడియ గట్టును.

6. భూమి దాని వార్షిక కక్ష్యలో సూర్యుని చుట్టు పరిభ్రమించుటకు 365 దినముల, 5 గంటల, 48 నిమిషముల 45. 51 సెకన్లు పట్టును.

7. వాటిని నిరూపించిన సృష్టికర్తను గూర్చియున్న వేలకొలది ఋజువులలో యివి కొన్నియే. ఈ విశ్వములో లక్షలాది ఋజువు లున్నవి. దేవుడు నరుని చేయుట ఆశ్చర్య కరము. ఆయన మనలను గూర్చి ఆలోచించు చున్నారు. మనము దేవునికే మహిమ చెల్లించుదము (రోమా 1:20).

బైబిలును గూర్చిన గొప్ప వాస్తవములు.

1. భూమి మీద ఉన్న యితర పుస్తకముల కంటె అది ఎక్కువ మందిచే చదువబడుచున్నది.

2. అది లిఖింపబడి 2000 సంవత్సరములు పైగా గతించి పోయినను దాని సందేశము నవీన మైనదై, నాగరిక మానవుని సంతృప్తి పరచునదిగా ఉన్నది. అది "జీవము గలది, శక్తివంతమైనది" (హెబ్రీ 4:12).

2. నాస్తికుల రచనలు బైబిలును చెల్లకుండా చేస్తాయని, త్వరలో అది వస్తు ప్రదర్శనశాలలో మాత్రమే కన్పించునని 200 సంవత్సరముల క్రితము నాస్తికులు అన్నారు. నేడైతే వారి రచలను చదువు వారు బహు కొద్దిమంది మాత్రమే. గాని గత పది సంవత్సరముల కాలములో "ప్రపంచమందు అత్యధికముగా అమ్ముడగుచున్న గ్రంథము" బైబిలు ఒక్కటే. ఈ గ్రంథము నేటి మానవునికి సరిపడునది. మత్తయి 24:35. "నా మాటలు ఎన్నడును గతింపవు".

– చార్లెస్ యఫ్. స్కాట్

# షేబ దేశపు రాణి

## ( The Queen of Sheba )

బహుజన సమూహములు ఆయన యొద్దకు కూడి రాగా వారి యొక్క తిరుగుబాటు స్వభావముతో కూడిన హృదయస్థితి నెరిగినవాడై ప్రభువైన యేసు ఈ విధముగా చెప్పెను. "దక్షిణ దేశపు రాణి విమర్శ కాలమున ఈ తరము వారితో కూడ లేచి వారి మీద నేరస్థాపన చేయును. ఆమె సొలొమోను జ్ఞానమును వినుటకు భూమ్యంతముల నుండి వచ్చెను. ఇదిగో సొలొమోను కంటె గొప్పవాడిక్కడనున్నాడు" (లూకా 11:31). ఈ షెబదేశపు రాణి ఆ దినములలో యుండిన రాజులందరి లోను చాల ఘనతకెక్కినది. ఆమె సొలొమోను జ్ఞానమును గూర్చియు, అతని ఐశ్వర్యమును గూర్చియు, యెహోవా నామమును గూర్చియు విని గూఢార్థము గల మాటలచే అతనిని శోధించుటకై వచ్చును (1 రాజులు 10: 1-3).

షెబ దేశపు రాణి ఆమె వినిన దానిని గూర్చి చూచి తెలుసుకొనుట కును, ఇశ్రాయేలీయులతో వర్తక వ్యాపారము జరిగించుకొనుటకును వచ్చెనందురు. కాని ప్రభువైన యేసు ఆమె సొలొమోను జ్ఞానమును గూర్చి

తెలిసి కొనుటకే వచ్చెనని మాటల ద్వారా తెలియపరచెను. ఆమె ప్రయాణము చేసిన దూరము సుమారు 1200 నుండి 2000 మైళ్ళు వరకు గలదు. అప్పటి ఆచార ప్రకారము ఆమె రాజైన సొలొమోనుకు బంగారమును, విస్తారమైన గంధవర్గమును రత్నములను ఇచ్చెను. ఆమె రాజ్యమునకు, పరిపాలనకు సంబంధించిన అనేక విషయములను తెలిసికొనుటకు, ఆమె పరిపాలనా సంబంధమైన అనేక ప్రశ్నలను జ్ఞానియైన సొలొమోను ద్వారా తెలిసి కొనుటకును వచ్చెను. నీ కార్యములను గూర్చియు, జ్ఞానమును గూర్చియు నా దేశమందు నేను వినిన మాట నిజమే; అయినను నేను వచ్చి కన్నులారా చూడక మునుపు ఆ మాటలను నమ్మక యుంటిని; ఉన్నవాటిలో సగమైనను నాతో చెప్పబడి యుండలేదని యిప్పుడు నేను తెలిసికొనుచున్నాను... నీతి న్యాయములననుసరించి రాజకార్యము లను జరిగించుటకు ఆయన నిన్ను నియమించెను (1 రాజులు 10:6-9) అని ఆమె చెప్పెను.

సొలొమోను యింకను చిన్న వాడుగ యుండినపుడు ఇశ్రాయేలీయు లను పరిపాలించే బాధ్యత గలవాడై నందున దేవుడైన యెహోవా తనకు యేమి కావలెనో కోరుకొనుమని చెప్పెను. అప్పుడు సొలొమోను జ్ఞానమును, వివేచనను, దేవుని జనాంగమైన ఇశ్రాయేలీయులను సమర్థతతో పరిపాలించగలిగే నేర్పరి తనమును అడిగెను (1 రాజులు 3:5-14). సొలొమోను అడిగిన వన్నియు దేవుడతని కనుగ్రహించెను. ఇశ్వర్యమును, ఘనతను అడుగక పోయినను వాటిని కూడ సొలొమోనుకు దేవుడనుగ్రహించెను. యెహోవాకు విరోధమైన జ్ఞానమైనను, ఆలోచన యైనను, వివేచనయైనను నిలువదు (సామె 21:30). సొలొమోనుకు దేవుని నుండి కలిగిన ఈ గొప్ప జ్ఞానమును గూర్చి విని అట్టి జ్ఞానమును సంపాదించు విధమును తెలిసికొనుటకు ఆమె వచ్చెను.

అయితే జ్ఞానియైన వాడెవరు? ఈలోక జ్ఞానము దేవుని దృష్టికి వెఱ్ఱి తనమే. అధికమైన విద్య సంపాదించి ఉన్నతమైన పదవులలో యుండి నప్పటికిని దేవుని మాటలయందు శ్రద్ధ వహించక, ఆయన ఆజ్ఞల ననుసరించి నడువనిచో అట్టి వారి జ్ఞానము వెఱ్ఱి తనమే. జ్ఞానమును గూర్చి సొలొమోను మహారాజు చెప్పిన కొన్నివిషయములు : 1. ఉపదేశము నంగీకరించు వాడు జ్ఞాని (సామె 10:8, 12:15). 2. జ్ఞానుల నాలుక మనోహరమైన జ్ఞానాంశములను పలుకును (సామె 15:2). 3. తల్లిదండ్రులకు విధేయుడగు వాడు జ్ఞాని (13:1). 4. తన పెదవులను మూసుకొనువాడు బుద్ధిమంతుడు (సామె 10:19; 14:17). 5. రాబోవు దినముల కొరకు సిద్ధపడువాడు జ్ఞాని. వేసవి కాలమున కూర్చువాడు బుద్ధిగల కుమారుడు (సామె 10:5). మోషే కూడ ఇశ్రాయేలీ యుల ప్రజలను గూర్చి ఈ మాట చెప్పుచున్నాడు (ద్వితీయోప 32:29). 6. జ్ఞానము గలవారు ఇతరులను రక్షించుదురు (సామె 11:30). 7. ద్రాక్షారసము వెక్కిరింతల పాలు చేయును. మద్యము అల్లరి పుట్టించును. దాని వశమైన వారందరు జ్ఞానము లేనివారు (సామె 20:1). 8. పరిశుద్ధతను కాపాడు కొనువాడు జ్ఞాని (సామె 5:1-5; 7:6-27). 9. జ్ఞానము గలవాడు భయపడి కీడు నుండి తొలగును (సామె 14:16).

**సొలొమోను కంటె గొప్పవాడైన యేసు :** సొలొమోను యొక్క జ్ఞానాంశ ములను మనము అనేకములు చదువు చున్నాము. సామెతల గ్రంథములో జ్ఞానాంశములను మనము అనేకములు చదువుచున్నాము. సామెతల గ్రంథములో జ్ఞానము అనేకసార్లు సొలొమోను క్రీస్తుప్రభువుతో సరిపోల్చు టను మనము గమనించవలెను. అయితే సొలొమోను జ్ఞానము కంటె మిన్నయైన జ్ఞానము క్రీస్తు నందు గలదు. బుద్ధి జ్ఞానముల సర్వ సంపదలు ఆయన యందే గుప్తములై యున్నాయని (కొలస్స 2:3), ఆయన మాటలను పెడచెవిని పెట్టువారిని

గూర్చి విమర్శదినమందు దక్షిణ దేశపు రాణి వారిమీద నేరస్థాపన చేయునని చెప్పుచున్నారు. షెబదేశపు రాణి యదార్థతను గుర్తించి దాని ప్రేమించి దానిని గూర్చి తెలిసికొనుటకు భూమ్యంతముల నుండి వచ్చినది. ఆయన మాటలు విని వాటిని గైకొను వాడు బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండునని యేసు చెప్పుచున్నారు (మత్తయి 7:23-25).

ఇదంతయు విినిన తరువాత తేలిన ఫలితార్థమిదే; దేవుని యందు భయ భక్తులు కలిగి యుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను. మానవ కోటికి ఇదియే విధి (ప్రసంగి 12:13). మన ప్రభువైన క్రీస్తు ఆయన కట్టడలకు విధేయులై జీవించుటయే జ్ఞాన సారాంశమని చెప్పుచున్నారు. తనకు విధేయులైన వారందరికి ఆయన నిత్య రక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:9). ఇట్టి పరమార్థమైన జ్ఞానము యొక్క విలువ: 1. అది ఐశ్వర్యము (సామె 3:14,15). 2. అది జీవము (8:35). 3. సంతోషము నిచ్చును (3:13). 4. అది జీవముగను, అలంకారము గను యుండును (3:21-24; 2:3).

1. ఈ జ్ఞానము యిచ్చువాడు యెహోవాయే (సామె 2:6). 2. యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము (సామె 1:7). 3. మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగ యున్న యెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతని కనుగ్రహించబడును (యాకోబు 1:5). మనము జ్ఞానము కొరకు ప్రార్థించినను దేవుని చిత్తమునకు లోబడనట్లయిన దానిని పొందలేము. 4. జ్ఞానుల సహవాసము చేయువాడు జ్ఞానము గలవాడగును (సామె 13:20).

షెబదేశపు రాణి సొలొమోను యొక్క జ్ఞానమును గూర్చి విని దానిని తెలిసికొని, అభ్యసించుటకు దూరమును లక్ష్యపెట్టక, ఎంతో సమయమును దాని కొరకు వెచ్చించి జ్ఞాన లాభమును పొంది యుండుటచే షెబదేశపు రాణిని మనము జ్ఞాపకము చేసికొనుచున్నాము.

– లోటీ బెత్ హాబ్స్

# సంక్షిప్త వార్తలు

2019 మార్చి 9వ తేదీ శనివారం కాకినాడ రాయుడుపాలెం, ఇందిరా కోలనీలో యున్న క్రీస్తుసంఘము తమ నెలసరి సహవాస కూటము నిర్వహించిరి. స్థానిక సంఘస్థులు ప్రతి రెండవ శనివారము కూడుకొని వాక్యపరిచర్యలోను, సహవాసములోను దినమంతయు దైవసన్నిధిలో గడుపుటకద్దు.

ఆ కూటములో జాషువాగూటం గారు సతీసమేతముగా హాజరై రెండు పూటలలోను చక్కటి వాక్యపరిచర్య చేసిరి. 127వ దావీదు కీర్తన, 133వ దావీదు కీర్తనలను విశ్లేషించి వివరించిరి. సంఘమును తగురీతిగా వాక్యమును బట్టి ప్రోత్సహించిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచి భోజన పానాదులను ఏర్పాటు చేసిరి. సహోదరులు పి. వెంకటరావు గారును, వారి సతీమణియు ఇందిరా కోలనీలోను, వెంకటకృష్ణరాయపురంలోను, తదితర ప్రాంతములలోను పలుసంవత్సరములుగా కృషిచేస్తు బలమైన స్థానిక సంఘములను తయారుచేసిరి. దేవుడు వారి కుటుంబమును దీవించును గాక.

2019 మార్చి 9వ తేదీనాడు రోనీగూటం గారు విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఒక దినపు బైబిలు క్లాసును నిర్వహించిరి. బైబిలు నుండి అనేక లోతైన మర్మములు ఆయన బోధించుచుండగా వినినవారు ఆనందభరితులై రోనీ గూటం గారిని పదేపదే రావలెనని ఆహ్వానించిరి. 10వ తేదీన ఆయన రాజాంలోను, సోమరాజుపేటలోను యున్న సంఘములలో ఆరాధనలో పాల్గొని వాక్యపరిచర్య చేసిరి.

మరల రోనీగూటం గారు మార్చి మూడవ వారములో విజయనగరం వెళ్లి 23వ తేదీన నెల్లిమర్లలో కూడి వచ్చిన సువార్తికులతో బైబిలు క్లాసు నిర్వహించిరి. 24 ఆదివారం విజయనగరంలో ఆరాధన ముగించుకొనిన తరువాత కుమరాం, సేరిపేట గ్రామములు దర్శించి వాక్యపరిచర్య చేసిరి. ఈ పని అంతటిలోను సోదరులు సి. హెచ్.ప్రశాంత్ కుమార్ గారు రోనీ గూటం గారికి ఎంతగానో సహకరించిరి.

2019 మార్చి 13వ తేదీ నాడు కోటిపల్లి కోట (ద్రాక్షారామం మండలం) లో జరుగుచున్న సువార్తకూడికలలో ఉదయం రోనీ గారును, సాయంత్రం రిక్కీ గూటం గారును చక్కటి వాక్యపరిచర్య చేసిరి. కోటిపల్లి కోటలో సోదరులు భాస్కర్ గారు అనేక సంవత్సరములుగా కృషిచేస్తు చక్కటి సంఘమును నిర్మించిరి.

2019 మార్చి 14వ తేదీ నాడు కాకినాడ నుండి వెలువడుచున్న బేసిక్ బైబిలు కోర్సును పూర్తిచేసిన మతశాఖల బోధకులను ఒకచోట పోగుచేసి రోనీ గూటం గారు వారికి ఆ కోర్సులోని పాఠములను సవిస్తరముగా బోధింపసాగిరి. హాజరైన వారందరు బైబిలు సత్యములను గ్రహిస్తు దేవుని అమిత జ్ఞానమును గూర్చి ఆశ్చర్య చకితులైరి. వచ్చిన వారంతా వీలైనంత త్వరలో మరల కూడు కొనుటకు నిశ్చయించుకొనిరి. బహుశ మార్చి 28వ తేదీన కూడుకొనుటకు వారు నిర్ణయించుకొనిరి. ఈ పత్రిక ముద్రించుసరికి ఆ బైబిలు తరగతి ఒక సహోదరుని ఇంటిలో జరుగుచుయున్నది.

2019 మార్చి 15వ తేదీనాడు కాకినాడ సత్యవాణి ఆవరణలో కాకినాడ లోను, పరిసరప్రాంతములలోను యున్న సువార్తికులకు ప్రత్యేక కూడిక నిర్వహించబడెను. దానిలో రిక్కీ గారు ముఖ్యపాత్ర వహిస్తు రాబోవు ఎన్నికలలో నీతి, నిజాయితీ పరులైన నాయకులను, క్రీస్తు సువార్తకు ఆటంకము లేని ప్రభుత్వమును ఎన్నుకొనుటలో క్రైస్తవుల బాధ్యతలు వివరించిరి. 500 మందికి పైగా ఆరోజు హాజరై రిక్కీగూటం గారి నాయకత్వమును అభినందించిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచి విందునేర్పాటు చేసెను.

**RNI Regd. No. 69973/98**

**Postal Regd. No. AP/KD-02/2018-20**

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.